## క్లుప్తంగా

### సీఎం రిలీఫ్ ఫండ్ అందజేసిన ఎంపీ



బుచ్చినాయుడుకండ్రిగలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎంపీ

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక వైఎస్సార్‌సీపీ నేత రామచంద్రనాయుడు కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ రూ.8 లక్షల చెక్కును తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయ కర్త నూకతోటి రాజేష్ అందజేశారు. రామచంద్రనాయుడు అనారోగ్యంతో మృతి చెందారు. ఆస్పత్రి ఖర్చులకు అయిన ఖర్చులకు రూ. 8 లక్షల చెక్కును ఆయన భార్య సుజాత పేరున ఆయన కుమారుడు రాజీవ్‌కుమార్‌కు అందజేశారు. ఆయన కుటుంబ సభ్యులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సింగిల్ విండో చైర్మన్ పల్లంపర్తి హరనాథరెడ్డి పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన

సత్యవేడు: సత్యవేడు పంచాయతీ పరిధిలో ఉన్న 11 పోలింగ్ బూత్‌లను ఎస్‌ఐ వీరాంజనేయులు పరిశీలించారు. సోమవారం ఆయన తన సిబ్బందితో కలసి 251 పోలింగ్ కేంద్రం నుంచి 161 నంబరు గల కేంద్రాలను ఆయన పరిశీలించారు. వీటిలో కోమటిగుంట, దళవాయి అగ్రహారం, రాంనగర్ పంచాయతీ కార్యాలయం, జూనియర్ కళాశాల, బాలుర ఉన్నత పాఠశాల, సీఎస్‌ఐ ప్రాథమిక పాఠశాల గదులను పరిశీలించారు. కానిస్టేబుళ్లు రెడ్డిశేఖర్, గురవయ్య పాల్గొన్నారు.

### విద్యార్థులకు ఉచిత వైద్యసేవలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తిమ్మభూపాలపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సోమవారం అపోలో సంస్థ చైర్మన్ పద్మవిభూషణ్ డాక్టరు ప్రతాప్‌చంద్రారెడ్డి 92వ జయంతిని పురస్కరించుకుని స్టెప్స్ సంస్థ ఆధ్వర్యంలో డాక్టరు ప్రమీలమ్మ ఉచిత వైద్యసేవలు అందించారు. మలేరియా, డెంగి, టైఫాయిడ్, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఐరన్, క్యాల్షియం మాత్రలతో పాటు ప్రోటీన్ పౌడర్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాధవి, సంస్థ డైరెక్టరు సుధాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### ఉచిత కంటివైద్య శిబిరం




సత్యవేడు: శంకర్ నేత్రాలయ(చెన్నై) వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటివైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సోమవారం సీఎస్‌ఐ పాఠశాలలో నిర్వహించిన కంటివైద్యశిబిరంలో డాక్టర్ గుణశేఖర్, రాము కలసి 165 మందికి కంటి పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. 22 మందిని కంటి ఆపరేషన్‌కు రెఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ సుబ్రమణ్యం, వైద్యశాల సిబ్బంది రోస్‌లిన్, ఏ.యమున, టి.ఇంద్రాణి, టి.సరస్వతి, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.


### ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ

రేణిగుంట: మండలంలో వెదుళ్లచెరువులోని ఓంకార జ్యోతిర్లింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రతి ఏటా ఇక్కడ వైభవంగా శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి తెలిపారు. మార్చి 8న ఉదయం నుంచే ప్రత్యేక అభిషేకాలు, భక్తుల సర్వదర్శనం కల్పిస్తారన్నారు. ఆ తర్వాత 50 అడుగుల మహా శివలింగానికి పాలాభిషేకం చేస్తామన్నారు. 9న శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు.


### తల్లీబిడ్డల అదృశ్యం



గణపతి



నీలవేణి



వినోద్ (ఫైల్)

ఏర్పేడు: తల్లీబిడ్డల అదృశ్యంపై ఫిర్యాదు అందినట్టు సోమవారం ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం.. గుండ్లకండ్రిగ గ్రామానికి చెందిన సుబ్రమణ్యం గత నెల 20న కూలి పనుల కోసం తిరుపతి వెళ్లాడు. అదే సమయంలో తన భార్య గణపతి(30), కుమార్తె నీలవేణి(13), కుమారుడు వినోద్(11)ను తిరుపతిలోని ఓ ప్రభుత్వ హాస్టల్‌లో దింపాడు. పనులు ముగించుకుని అదే రోజు సాయంత్రం ఇంటికి వెళ్లి చూడగా భార్య, ఇద్దరు పిల్లలు కనబడలేదు. అప్పటి నుంచి హాస్టల్, చుట్టు పక్కల వెదికినా కనబడకపోవడంతో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 9440900729 ఫోన్ నంబరుకు సమాచారం అందించాలని సీఐ చెప్పారు.

# గ్రామ పంచాయతీలకు నిధుల వరద

- 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.90.08 లక్షల మంజూరు
- గ్రామాల్లో కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు అవకాశం
- గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ఆధారంగా పనులు



మత్తేరిమిట్ట గ్రామ పంచాయతీ

వరదయ్యపాళెం: పంచాయతీలకు ఆర్థికదన్ను కల్పించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి నోచుకోని గ్రామాల రూపురేఖలను మార్చేందుకు తాజాగా 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. వీటితో సీసీ రోడ్లు, కాలువలు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి పనులు చేపట్టేందుకు అవకాశం ఏర్పడింది. గ్రామ పంచాయతీల్లో కొత్త పాలన వచ్చి మూడేళ్లు అయిన సందర్భంగా మండలంలో గ్రామ సర్పంచ్‌ల పాలన ఉన్న పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.90,08,102 జమ చేసింది. వీటికి 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన ఆయా పంచాయతీల ఖాతాల్లో పీఎఫ్ఎంఎస్ (పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) ద్వారా జమ చేసింది. ఈ నిధులతో గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలతో పాటు పారిశుద్ధ్య పనులు, వివిధ రకాల చార్జీల చెల్లింపు, చెత్త నుంచి సంపద ఉత్పత్తి కేంద్రాల నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలు కూడా చెల్లించవచ్చు.

**29 పంచాయతీలకు లబ్ధి..**

మండలంలోని 29 గ్రామ పంచాయతీలకు తాజాగా 15వ ఆర్థిక సంఘం నిధులు జమయ్యాయి. 2022–23 ఆర్థిక సంఘంలో ఇచ్చిన ముందస్తు ప్రణాళిక ద్వారా మొదటి విడత కింద రూ.90,08,102 నిధులు విడుదలయ్యాయి. వచ్చే రెండు నెలల్లో (ఫిబ్రవరి, మార్చి) 2023–24 నిధులు కూడా విడుదల కానున్నాయని అధికారులు వెల్లడించారు. దీంతో పంచాయతీల్లో ఇంతవరకు జరగని స్థాయిలో అభివృద్ధి పనులు ఊపందుకోనున్నాయి. మారుమూల ప్రాంతాలు, అనుబంధ గ్రామాలు కొత్తగా ఏర్పడిన పంచాయతీల్లో ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ నిధులపై రాష్ట్రప్రభుత్వం పర్యవేక్షణ ఉంటుంది. పంచాయతీల్లో వివిధ ఖర్చులకు సంబంధించిన బిల్లులకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రామస్వరాజ్య ఈ–పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

**ఖర్చు చేయాల్సిన విధివిధానాలు..**

పంచాయతీలకు జమైన నిధులు టైడ్, అన్‌టైడ్‌ల కింద విడుదల అవుతాయి. టైడ్ కింద రహదారులు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం, కరెంటు బిల్లు చెల్లింపు, గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ, హెల్త్ సెంటర్, పంచాయతీ భవనాల అభివృద్ధికి వినియోగించుకోవాలి. అన్‌టైడ్ నిధుల కింద తాగునీటి అవసరాలు, చేతిపంపులు, నీటి ట్యాంకులు, మోటార్ల నిర్వహణ చేసుకోవాలి.

**గ్రామ పంచాయతీల వారీగా మంజూరైన నిధులు**

| పంచాయతీ | రూ.లక్షల్లో | | |
|---|---|---|---|
| అంబూరు | 1,48,852 | కురింజల్లం | 1,16,236 |
| అరుదూరు | 1,40,440 | కువ్వాకొల్లి | 3,29,109 |
| అయ్యవారిపాళెం | 1,29,102 | మరదవాడ | 1,85,177 |
| బత్తలవల్లం | 7,19,822 | మత్తేరిమిట్ట | 1,77,887 |
| సీఎల్ఎన్‌పల్లి | 3,61,817 | మావిళ్లపాడు | 89,539 |
| చిలమత్తూరు | 3,32,383 | ముస్లింపాళెం | 2,94,762 |
| చిన్న పాండూరు | 2,55,795 | నెల్లటూరు | 1,72,834 |
| గూడలవారిపాళెం | 1,14,257 | పెద్ద పాండూరు | 5,18,390 |
| ఇందిరానగర్ | 1,91,335 | పులివల్లం | 1,74,462 |
| కదూరు | 3,57,753 | రాచర్ల | 2,82,519 |
| కళత్తూరు | 1,92,813 | సంతవేలూరు | 6,36,986 |
| కాంబాకం | 3,68,882 | తొండంబట్టు | 3,97,623 |
| కంచరపాళెం | 2,30,978 | తొండూరు సొసైటీ | 3,99,741 |
| కారిపాకం | 3,50,887 | వరదయ్యపాళెం | 12,02,935 |
| | | యానాదివెట్టు | 1,34,786 |

**మార్గదర్శకాల ప్రకారం ఖర్చు చేయాలి..**



ప్రభుత్వం ద్వారా విడుదలైన 15వ ఆర్థికసంఘం నిధులకు సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఖర్చు చేయాలి. ప్రాధాన్యత మార్గదర్శకాల ప్రకారం ఖర్చు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాల్సి ఉంటుంది. అభివృద్ధి పనులకు ఉపయోగించిన నిధుల వివరాలు, బిల్లులను గ్రామ స్వరాజ్య పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ నిధులు గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయి.
– సుబ్రమణ్యం రాజు, ఎంపీడీఓ, వరదయ్యపాళెం

# పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు..



కరపత్రం అందజేసి నమస్కరిస్తున్న పవిత్రారెడ్డి

- సార్వత్రిక ఎన్నికలకు సిద్ధంకండి
- ఎన్నికల ప్రచారంలో బియ్యపు పవిత్రారెడ్డి

ఏర్పేడు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా అందరూ కలసికట్టుగా కృషి చేయాలని, ఆ దిశగా ప్రజలు జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించేలా చూడాలని వైఎస్సార్ సీపీ తొట్టంబేడు మండల కన్వీనర్ బియ్యపు పవిత్రారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని మర్రిమందలో ఆమె శంఖం పూరించి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఆమె మాట్లాడుతూ, అభివృద్ధి పనులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. 2019లో ఏర్పేడు మండలంలో వైఎస్సార్ సీపీకి భారీ మెజారిటీ ఇచ్చిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు రుణపడి ఉంటామన్నారు. 2024లోనూ ఇదే ఫలితం పునరావృతం కావాలన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి జగనన్న ప్రభుత్వం నగదు జమ చేస్తోందని, ఇదే టీడీపీ పాలనలో దీనికి పూర్తిగా భిన్నమన్నారు. కరోనా సమయంలో కానరాని ప్రతిపక్షాలు ఎన్నికలు సమీపిస్తుండడంతో కల్లబొల్లి మాటలు, వంచన హామీలతో ప్రజల వద్దకు వస్తున్నాయని, వాటికి మరోసారి బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. వైఎస్సార్ గెలిపించాలని ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలతో లబ్ధిని వివరించి కరపత్రాలను అందజేశారు.

**ఘన స్వాగతం..ఆలయంలో పూజలు**

తొలుత పాపానాయుడుపేట ద్రౌపదీసమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో పవిత్రారెడ్డి అర్చనలు, పూజలు చేశారు. గ్రామస్తులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, జెడ్పీటీసీ తిరుమలయ్య, ఎంపీటీసీలు నాగరాజురెడ్డి, మునిరాజా, సర్పంచ్ లలిత, మాజీ సర్పంచ్ తంబా సుబ్రమణ్యం, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు నాగారునరెడ్డి, పార్టీ నాయకులు షేక్ మస్తాన్, గోపీ రాయల్, కృష్ణారెడ్డి, ఈశ్వర్, సయ్యద్ కరీముల్లా, మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీని ఆదరించండి



ప్రజలతో మాట్లాడుతున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి

శ్రీకాళహస్తి: రాష్ట్రంలో సంక్షేమ పాలన కావాలంటే వైఎస్సార్ సీపీని ఆదరించాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి కోరారు. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం తొట్టంబేడు మండలం ఇలగనూరు పంచాయతీలో ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని తెలియజేశారు. మరో రెండు నెలల్లో ఎన్నికల రానున్న తరుణంలో నాలుగేళ్లుగా ప్రజలకు మొహం చాటేసిన వారంతా ఇప్పుడు ప్రజలను మరోసారి వంచించేందుకు ఇస్తున్నారని, అలాంటి వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. జగనన్న ప్రభుత్వం చేసిన మేలును దృష్టిలో ఉంచుకుని ఎన్నికల్లో మరోసారి పట్టం కట్టాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఉన్నం వాసునాయుడు, ఎంపీపీ నిర్మలమ్మ, సర్పంచ్ సుబ్రహ్మణ్యంనాయుడు, పార్టీ నాయకులు సుబ్రహ్మణ్యం, శంకర్, మునిరత్నం, శంకరయ్య, రవీందర్‌రెడ్డి, భక్తవత్సలం, కోవి చంద్రయ్యనాయుడు, మణినాయుడు, రమణయ్యనాయుడు, ఢిల్లీబాబు, భాస్కర్, గెరటారెడ్డి, సునంద, సునీత, వెంకటరమణానాయుడు, చెంచురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 11న బీసీల విజయభేరి సభ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న వడ్లతాంగళ్ బాలాజీరెడ్డి

ఏర్పేడు: శ్రీకాళహస్తిలోని శివం కల్యాణ మండపంలో ఈ నెల 11న నిర్వహించ తలపెట్టిన బీసీల విజయభేరి సభను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వడ్లతాంగళ్ బాలాజీ రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని చెన్నంపల్లెలో ఆయన బీసీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, జగనన్న ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బీసీలకు సముచిత స్థానం కల్పించిందన్నారు. కార్యక్రమంలో మణిరెడ్డి, కృష్ణారెడ్డి, రత్నంరెడ్డి, దామోదరం రెడ్డి, మునికృష్ణారెడ్డి, వెంకటరమణారెడ్డి, లక్ష్మీనారాయణ, వెంకటమ్మ, సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీ విజేతలకు బహుమతులు ప్రదానం



కబడ్డీ విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న మ్యాజిక్ బస్ సంస్థ ప్రతినిధులు

వరదయ్యపాళెం: మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్, మోండలెజ్ పరిశ్రమ సంయుక్తంగా వరదయ్యపాళెం హైస్కూల్‌లోని 6, 7, 8 తరగతులకు కబడ్డీ పోటీలను నిర్వహించాయి. వీరిలో గెలుపొందిన వారికి సోమవారం పాఠశాలలో హెచ్‌ఎం రమణయ్య, ఫిజికల్ డైరెక్టర్ బందిల కుమార్ చేతుల మీదుగా మ్యాజిక్ బస్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ సుమంత్ బహుమతులను అందజేశారు. అలాగే విద్యార్థులకు క్రీడా దుస్తులను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో పీఈటీ రమేష్, ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ సుమంత్, కోట్ కిరణ్, ఉపాధ్యాయులు హాజరయ్యారు.

## ముక్కంటి సేవలో..



కర్నాటి రాంబాబుకు జ్ఞాపిక అందజేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని సోమవారం విజయవాడ శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయ పాలకమండలి చైర్మన్ కర్నాటి రాంబాబు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యం



వరదయ్యపాళెం సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి

వరదయ్యపాళెం: జిల్లాలో పేదల ఇళ్ల నిర్మాణం కోసం ఏర్పాటైన జగనన్న కాలనీలకు పూర్తిస్థాయిలో విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి తెస్తున్నామని, అందుకు సంబంధించి ఇప్పటికే పనులు కూడా పూర్తి చేసినట్లు జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి వెల్లడించారు. ఆయన సోమవారం వరదయ్యపాళెం, చిన్న పాండూరు సబ్‌స్టేషన్లను తనిఖీ చేశారు. వరదయ్యపాళెం టౌన్‌లో లోఓల్టేజ్ సమస్య ఉన్న విజ్ఞాన్‌నగర్, సినిమాహాల్ వీధి, బీసీకాలనీ, గోపాలరావుకాలనీలను సందర్శించి అక్కడ ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. లోఓల్టేజ్ సమస్యలను అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి స్థానిక విద్యుత్ సిబ్బందితో చర్చించారు. అనంతరం వరదయ్యపాళెం సబ్‌స్టేషన్ వద్ద కొందరు రైతులు విన్నవించిన సమస్యలను విని తక్షణమే పరిష్కారం చూపాలని విద్యుత్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రానున్న వేసవి దృష్ట్యా విద్యుత్ కొరత రానివ్వకుండా, కోతలు విధించకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల దృష్ట్యా సబ్‌స్టేషన్లను తనిఖీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. లోఓల్టేజీ సమస్య తలెత్తకుండా ఇకపై గృహ వినియోగదారులకు సైతం త్రీఫేజ్ కరెంటు సరఫరా చేయనున్నామని పేర్కొన్నారు. ఆ దిశగా సింగిల్ ఫ్యూజ్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో త్రీఫ్యూజ్ ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే జగనన్న కాలనీల్లో నూతనంగా నిర్మించుకుంటున్న ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కోసం వారి వివరాలను మండల విద్యుత్‌శాఖ ఏఈలకు అందజేస్తే అదనపు స్తంభాలను ఏర్పాటు చేసి ఆ ప్రాంతాలకు విద్యుత్ సౌకర్యాన్ని పునరుద్ధరిస్తామన్నారు. ఎప్పటికప్పుడు గ్రామస్థాయిలో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చొరవ చూపుతామన్నారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి పలు విద్యుత్ సమస్యలను ఎస్ఈ దృష్టికి తెచ్చారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. గోపాలరావుకాలనీలో ఇచ్చిన మాట ప్రకారం విద్యుత్ సౌకర్యం కల్పించినందుకు కృతజ్ఞతగా స్థానిక ఎంపీటీసీ తనయుడు వినోద్ యాదవ్, ఎస్ఈ కృష్ణారెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ పర్యటనలో ఎస్ఈ వెంట పుత్తూరు డీఈ చిన్నరెడ్డెప్పరెడ్డి, నాగలాపురం ఏడీఈ చంద్రా నాయక్, కన్‌స్ట్రక్షన్ డీఈ హరీష్, ఏఈ శివశంకర్, సబ్ ఇంజనీర్ సుబ్రమణ్యం ఉన్నారు.

## మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలో స్థానిక చెక్‌పోస్టు వద్ద మద్యం తరలిస్తున్న బాపట్లకు చెందిన భార్గవ్ అనే వ్యక్తి అరెస్టు చేసినట్లు సోమవారం ఎస్ఐ వెంకటనరసింహ తెలిపారు. 12 బాటిళ్ల మద్యాన్ని తీసుకెళ్తున్న భార్గవ్‌ను పట్టుకుని, బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్టు ఎస్ఐ వెంకటనరసింహ తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ రంగా పాల్గొన్నారు.

## ఎంపీడీఓగా షాలెట్



బుచ్చినాయుడుకండ్రిగ: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా షాలెట్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీ ప్రక్రియలో భాగంగా తిరుపతి జిల్లా చిట్టమూరు మండలంలో ఎంపీడీఓగా పనిచేస్తున్న ఆమె బదిలీపై వచ్చా రు. ఇక్కడ పనిచేస్తున్న సాయిలహరి చిట్టమూరు మండల ఎంపీడీఓగా బదిలీపై వెళ్లారు.

## ఎస్ఐగా అరుణ్‌కుమార్‌రెడ్డి



రేణిగుంట: రేణిగుంట అర్బన్ ఎస్ఐగా అరుణ్‌కుమార్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన శ్రీసిటీ పోలీస్‌స్టేషన్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కారానికి, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు.

## క్యాన్సర్‌పై అవగాహన

శ్రీకాళహస్తి: క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలో శ్రీరామ్‌నగర్ కాలనీలోని శ్రీచైతన్య పాఠశాలలోసోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ రూపాదేవి మాట్లాడుతూ, క్యాన్సర్ వ్యాధి ప్రాణాంతకమైందన్నారు. దీని బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. కార్యక్రమంలో ఏజీఎం సురేష్, కో–ఆర్డినేటర్ బాలాజి, డీన్ సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జ్ అనుష, ఏఓ సురేష్ పాల్గొన్నారు.

## ముక్కంటి సేవలో రష్యా దేశస్తులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని సోమవారం 30మంది రష్యా దేశస్తులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు రూ.750 రాహుకేతు పూజలను చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. వారు మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆలయ శిల్పకళ చాలా అద్భుతంగా ఉందని తెలిపారు.



రాహుకేతు పూజలు చేయించుకుంటున్న రష్యా భక్తులు

## తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ



ఉదయ భారతి

వరదయ్యపాళెం: మండల తహసీల్దార్‌గా వై.ఉదయ భారతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా వైఎస్సార్ కడప జిల్లా ఖాజీపేట మండలం నుంచి ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని నిర్వహిస్తున్న తహసీల్దార్ గౌరిశంకరరావు సబ్ కలెక్టర్‌గా పదోన్నతిపై అనంతపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికబద్ధంగా వెళ్తామన్నారు.

**నారాయణవనం తహసీల్దార్‌గా శంకర్ రావు**



శంకర్‌రావు

నారాయణవనం: మండల తహసీల్దార్‌గా శంకర్ రావు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో తహసీల్దార్ ప్రమీళ కడప కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్‌గా బదిలీపై వెళ్లగా, కడప జిల్లా వల్లూరు మండలం నుంచి శంకర్‌రావు నారాయణవనానికి బదిలీపై వచ్చారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిపించడానికి అంతా సహకరించాలని ఆయన కోరారు

**ఏర్పేడులో ఉదయ్ భాస్కర్ రాజు**




ఉదయ్ భాస్కర్ రాజు

ఏర్పేడు: తహసీల్దార్‌గా ఉదయ్‌భాస్కర్ రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ శివప్రసాద్ బదిలీపై వైఎస్సార్ కడప జిల్లాకు వెళ్లారు. వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రి నుంచి ఉదయ్‌భాస్కర్ రాజు ఇక్కడికి బదిలీపై చేరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు.

## ఆలయ పునర్నిర్మాణ పనుల్లో విగ్రహం తొలగింపు



గంగమ్మ పంచనామా నిర్వహిస్తున్న దృశ్యం



విగ్రహం కింద ఉన్ననాణేలు, రాగిరేకు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ ఏడు గంగమ్మల అమ్మవారి విగ్రహ పంచనామా సోమవారం పూర్తి చేసినట్టు పాలక మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తెలిపారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా అమ్మవారి విగ్రహాన్ని తొలగించి పంచనామా చేసి భద్రపరిచినట్టు వెల్లడించారు. అమ్మవారి విగ్రహం కింద రాగిరేకు, నాణేలు ఉన్నాయన్నారు. ఆలయ, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.